

## లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

**రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి**

ఆదిబట్ల, మే 8 : రెవెన్యూ పరిపాలన, సర్వే&ల్యాండ్ విభాగానికి సాయంగా రాష్ట్రంలోని దాదాపు 5వేల మంది లైసెన్స్ పొందిన సర్వేయర్లకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తున్నదని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణ కోసం అర్హత గల అభ్యర్థుల నుంచి తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్( తాలిమ్) దరఖాస్తులను ఆహ్వానిస్తున్నదన్నారు. రాష్ట్రంలోని అన్ని మీ సేవా కేంద్రాల్లో రూ.100 చెల్లించి దరఖాస్తు, ప్రాస్పెక్టస్ పొందవచ్చని పేర్కొన్నారు. మీ సేవా కేంద్రాల్లోనే ఈ నెల 17 వరకు దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. ఇంటర్‌లో గణితంలో 60శాతం మార్కులు సాధించినవారు, ఐటీఐ డ్రాఫ్ట్స్‌మన్ (సివిల్), డిప్లొమా(సివిల్), బీటెక్(సివిల్) లేదా సమానమైన అర్హత గలవారు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ప్రధాన కేంద్రాలలో మే 26 నుంచి జూన్ 26 వరకు 50 పని దినాల్లో శిక్షణ ఇవ్వబడుతుందని, ఇందుకు ఓసీ అభ్యర్థులు రూ.10 వేలు., బీసీ అభ్యర్థులు రూ.5వేలు., ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.2500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

### అందాల పోటీల నిర్వహణలో బిజీ..

# పేదలకు సాయం చేయడంలో లేజీ..!

- ఆ పోటీ ఖర్చులో 10 శాతం గుడిసెవాసులకు కేటాయించు
- సీఎం రేవంత్‌పై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మండిపాటు

పెద్దఅంబర్‌పేట, మే 8: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందాల పోటీల నిర్వహణలో బిజీగా ఉన్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఎద్దేవా చేశారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూరు సమీపంలోని రావినారాయణరెడ్డి కాలనీలో గత నెల కాలిపోయిన గుడిసెలను గురువారం ఎమ్మెల్సీ సత్యం, సీపీఐ నాయకులతో కలిసి పరిశీలించి, బాధితులతో మాట్లాడారు. అనంతరం విజయవాడకు చెందిన పాపులర్ షూ మార్ట్, పలువురి సహకారంతో బాధితులకు బ్లాంకెట్‌లు, టవళ్లు, బకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. 'సీఎం అందాల పోటీల్లో బిజీగా ఉన్నాడు. అందాల పోటీలు ప్రారంభమయ్యేలోపు గుడిసెలతోపాటు సర్వం కోల్పోయిన నిరుపేదలకు దుస్తులు, ఇతర వస్తువులు సాయం చేయాలి. ప్రభుత్వ అధికారులు ఇప్పటివరకు స్లిప్పులు



అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న సీపీఐ నేత నారాయణ, ఎమ్మెల్సీ సత్యం

ఇచ్చారే తప్ప డబ్బులివ్వలేదు. అందాల పోటీలకు కోట్లు, కోట్లు ఖర్చు చేస్తున్నారు. నిరుపేదలకేమో ఆరు వేలు ఇస్తామన్నారు. రెండ్రోజుల్లో పేదలకు ఇవ్వాల్సిన కనీస సాయం అందించాలి. అందాల పోటీల కోసం ఖర్చు పెట్టిన దాంట్లో 10 శాతం ఖర్చు పెడితే గుడిసెలు వచ్చేస్తాయి' అని అన్నారు. ఉద్దేశపూర్వకంగా గుడిసెలను తగలబెట్టడం ద్వారా పేదలను వెళ్లగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇంటి దొంగలపై కూడా ఓ కన్నేయాలని సూచించారు. కావాలనే తగలబెట్టాలనుకుంటే.. అలాంటివారిని తగలబెడతాం తప్ప ఇక్కడ నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు. రావినారాయణరెడ్డి కాలనీలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలందరికీ పక్కాగా ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఎమ్మెల్సీ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాలిపోయిన గుడిసెల్లో ఎంతోమంది పేద విద్యార్థుల సర్టిఫికెట్లు కూడా బూడిదయ్యాయని, వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులున్నారు.

# ఇండియన్ ఆర్మీకి సహకరిస్తాం

**తెలంగాణ స్టేట్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బూడిద నందా రెడ్డి**

మన్సూరాబాద్, మే 8: పాకిస్తాన్ భారత్‌తో యుద్ధానికి దిగితే ఇండియన్ ఆర్మీకి మా లారీలతో ఉచిత సేవలు అందిస్తామని తెలంగాణ స్టేట్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బూడిద నందా రెడ్డి తెలిపారు. ఆపరేషన్ సిందూర్ చేపట్టి పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో గల తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై భారత త్రివిధ దళాలు ఏకకాలంలో దాడులు చేసి ఉగ్రవాదులను మట్టుబెట్టినందుకు సంఘం తరపున హర్షం వ్యక్తం చేస్తూ గురువారం సాయంత్రం ఆటోనగర్‌లోని గంగా జమున హోటల్ నుంచి రాజధాని హోటల్ చౌరస్తా మీదుగా సుష్మ చౌరస్తా వరకు లారీ



ఆపరేషన్ సింధూర్‌ను హర్షిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న తెలంగాణ స్టేట్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

యజమానులందరూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నందారెడ్డి మాట్లాడుతూ.. తీవ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌పై ఇలాంటి సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్ లాంటి ఆపరేషన్స్ మరెన్నో నిర్వహించాలన్నారు. ఆపరేషన్ సిందూర్ చేపట్టిన భారత ప్రధానికి, జవాన్లకు ఎల్లవేళలా సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంరెడ్డి, ఆటోనగర్ ఇసుక లారీల యజమానుల సంఘం అధ్యక్షుడు రాజుగౌడ్, కొత్తపేట ఇసుక లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు వెంకన్న, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.



నూతనంగా జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపికైన షాద్‌నగర్ పట్టణానికి చెందిన మణివీర్, మధులికతేజను షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్, సభ్యులు, న్యాయవాదులు గురువారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి పాల్గొని మాట్లాడారు. జూనియ్ సివిల్ జడ్జిలుగా అందరికీ న్యాయం అందించాలని, రానున్న రోజుల్లో మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు ఆకాంక్షించారు. - షాద్‌నగర్‌టౌన్, మే 8

తెలుగు భాషా చైతన్య సమితి వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్ త్యాగరాయ గానసభలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ కవి సమ్మేళన కార్యక్రమంలో షాద్‌నగర్ పట్టణానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు, కవులు నరేందర్ రావు, రవిప్రకాశ్ సన్మానంతోపాటు ప్రశంసాపత్రాలను అందుకున్నారు. వీరు ప్రశంసా పత్రాలను అందుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.
- షాద్‌నగర్‌టౌన్, మే 8



# అంకితభావంతో పనిచేయాలి



వికారాబాద్, మే 8 : నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు అంకితభావంతో పని చేయాలని తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఉపాధ్యక్షుల ఎన్నిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీనివాసరావు , జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ, సెంట్రల్ కమిటీ సభ్యుడు కోటాజీ, రంగారెడ్డి జిల్లా టీజీవో అధ్యక్షుడు రామారావు, ఎక్స్ సిద్దిపేట టీజీవో అధ్యక్షుడు శ్రీరామ్‌రెడ్డి పాల్గొన్నారు. సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఆనంద్, వైస్ ప్రెసిడెంట్‌గా షఫీఉల్లాఖాన్, ఎంపీవో, జాయింట్ సెక్రటరీ(డబ్ల్యూ)గా ఫరాహిన్ ఖాతూన్ ఎన్నికయ్యారు. అనంతరం కమిటీ సభ్యులను సన్మానించారు.

## ఎంఫార్మసీ పరీక్ష తేదీల ఖరారు

**ఉస్మానియా యూనివర్సిటీ :** ఓయూ పరిధిలోని ఎంఫార్మసీ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫార్మసీ (పీసీఐ) మొదటి, మూడో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్ పరీక్షలను వచ్చే నెల 4 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

### పలు కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ప్రొ.శశికాంత్ తెలిపారు. పీజీ డిప్లొమో ఇన్ ఎర్లీ ఇంటర్వెన్షన్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలతో పాటు ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ కోర్సు సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ లో చూసుకోవాలని సూచించారు.

### ఎంపీఈడీ పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు..

ఓయూ పరిధిలోని ఎంపీఈడీ పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపరు రూ.1,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

### అలీ యావర్ జంగ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ డిజేబిలిటీస్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అలీ యావర్ జంగ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ డిజేబిలిటీస్‌లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలోని ఈ కేంద్రం 2025-26 విద్యా సంవత్సరానికి బీఏఎస్ఎల్పీ, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (హెచ్ఐ), ఎంఎస్సీ (ఆడియాలజీ) కోర్సులతోపాటు డిప్లొమా స్థాయి కోర్సులను సైతం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కోర్సుల్లో చేరేందుకు వచ్చేనెల 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశాలను ప్రవేశపరీక్షలో ప్రతిభ ఆధారంగా నిర్వహిస్తామని వివరించారు. ఇతర వివరాలకు www.ayjnishd.nic.inలో చూసుకోవాలని పేర్కొన్నారు.

# రోడ్లు ఇలా.. ప్రయాణమెలా..?

- మరమ్మతులకు నోచని గ్రామీణ రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు, ప్రయాణికులు
- కొన్ని చోట్ల నిధులు మంజూరైనా పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లు



చౌడాపూర్ మండలం ఈర్లవాగుతండా గ్రామపంచాయతీ నుంచి గాలిగూడెం వెళ్లే రోడ్డు

కులకచర్ల, మే 8 : కులకచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని వివిధ గ్రామాల్లోకి వెళ్లేందుకు రోడ్లు సరిగా లేకపోవడంతో వివిధ ప్రైవేటు వాహనాల ద్వారా వెళుతూ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కులకచర్ల మండల పరిధిలోని కామునిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బోజ్యానాయక్‌తండాకు రోడ్డు సౌకర్యం లేదు. బండవెల్కిచర్ల గ్రామం నుంచి సాల్వీడ్, చెల్లాపూర్ గ్రామాలకు రోడ్డు ఉన్నా శిథిలావస్థకు చేరుకున్నది. హన్మ్యానాయక్‌తండా గ్రామపంచాయతీకి చెల్లాపూర్ నుంచి బీటీ రోడ్డు లేదు. ఎర్రగోవింద్ తండాకు వెళ్లేందుకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించలేదు. మండల పరిధిలోని అంతారం బిందెంగడ్డతండా, చెరువుముందలి తండా, ఎత్తుకాల్వతండా, గోప్యానాయక్‌తండా(ఘనాపూర్), గోప్యానాయక్‌తండా(రాంనగర్), ఘట్టన్నపల్లి, చెరువుముందలితండా(కె), గోరిగడ్డతండా, పటేల్‌చెరువుతండాలకు కూడా బీటీ రోడ్డు సౌకర్యం లేదు. చౌడాపూర్ మండల పరిధిలోని లింగంపల్లి, అడవివెంకటాపూర్ గ్రామపంచాయతీలకు ఉన్న పాత రోడ్డు శిథిలావస్థకు గురికావడంతో ప్రతి రోజూ కులకచర్ల, చౌడాపూర్ మండల కేంద్రాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విఠలాపూర్, వీరాపూర్



శిథిలమైన ఈర్లవాగుతండాకు వెళ్లే రోడ్డు



చౌడాపూర్ నుంచి విఠలాపూర్ గ్రామపంచాయతీకి వెళ్లే రోడ్డు

గ్రామపంచాయతీలకు కూడా బీటీ రోడ్డు సౌకర్యం లేదు. శిథిలావస్థకు చేరిన రోడ్లపై వెళ్లేందుకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

### బీటీ రోడ్ల కోసం గ్రామీణ ప్రజల ఎదురుచూపులు

కులకచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని వివిధ గ్రామపంచాయతీలకు బీటీ రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం తమ గ్రామ పంచాయతీలకు బీటీ రోడ్లు వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బీటీ రోడ్ల కోసం చాలాకాలంగా ఎదురుచూస్తున్నామని తెలిపారు. విఠలాపూర్, ఈర్లవాగుతండా గ్రామపంచాయతీలకు రోడ్డు సౌకర్యం కల్పించలేదు. కులకచర్ల మండల పరిధిలోని పటేల్‌చెరువుతండా, అనంతసాగర్, చెరువుముందలితండా(ఎ) గ్రామాలకు రోడ్లు మంజూరైనా చాలాకాలంగా పెండింగ్‌లోనే ఉన్నది.

### నిధులు మంజూరైనా..



ప్రతి గ్రామ పంచాయతీకి బీటీ రోడ్డు ఉండాలని గతంలో చెప్పి.. కొన్ని గ్రామ పంచాయతీలకు నిధులు కూడా మంజూరు చేశారు. కాని ఇప్పటివరకు కాంట్రాక్టర్లు ప్రారంభించలేదు. వర్షాకాలం వస్తే ఆయా గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడనున్నారు. కనీసం మంజూరైన రోడ్లను ముందుగా ప్రారంభించి.. మంజూరుకాని రోడ్లకు నిధులు విడుదల చేసి రోడ్ల వ్యవస్థను పునరుద్ధరిస్తే వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు తప్పుతాయి.

**- రవినాయక్, మాజీ సర్పంచ్ గోగ్యానాయక్‌తండా, చౌడాపూర్ మండలం**

### తండాలకు బీటీ రోడ్లు వేయించాలి



ప్రతి గ్రామానికి, ప్రతి తండాకు బీటీ రోడ్లను సర్కారు వేయించాలి. తండాల్లో పాఠశాలలకు వచ్చే ఉపాధ్యాయులు, ఇతర పాఠశాలలకు చదువుకునేందుకు వెళ్లే విద్యార్థులు రోడ్డు సౌకర్యం సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు బాగుంటేనే అన్ని రకాలుగా వ్యవస్థ బాగుంటుంది. సర్కారు స్పందించి తండాలకు ముందుగా రోడ్డు సౌకర్యం కల్పించాలి.

**- రాథోడ్ శ్రీనివాస్‌నాయక్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు, కులకచర్ల మండలం**

# కార్మికుల హక్కులు కాలరాస్తే ఊరుకోం



బాలాపూర్ చౌరస్తాలో సమ్మె వాల్ పోస్టర్ ఆవిష్కరణ

బడంగ్‌పేట్, మే 8: బాలాపూర్ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో జాతీయ సార్వత్రిక కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్మికుల హక్కులను కాలరాసే ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. కార్మికుల హక్కులను కార్పొరేట్ వ్యవస్థకు కట్టబెట్టడం మంచి పద్ధతి కాదన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు ఉన్నారు.

**కందుకూరు :** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం మండల పరిధిలోని లేమూరు గ్రామంలో వాల్ పోస్టర్‌ను సీఐటీయూ కార్యదర్శి బుట్టి బాలరాజ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా బాలరాజ్ మాట్లాడుతూ, నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులపై పని భారాన్ని మోపుతూ, వేతనాలు పెంచకుండా కార్మికుల 29 చట్టాలను నిర్వీర్యం చేస్తున్నట్లు తెలిపారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉండే చట్టాలను తీసుకువచ్చి కార్మికుల బ్రతుకులతో చెలగాటం ఆడుతున్నదన్నారు. ఈ చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యోగ భద్రత కోసం దేశవ్యాప్తంగా 20న నిర్వహించే సార్వత్రిక సమ్మె ను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మహేశ్వరం మండల కన్వీనర్ శేఖర్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

**మన్సూరాబాద్ :** పాలకవర్గాలు కార్మిక వర్గాన్ని లేబర్ కోడ్‌లతో పారిశ్రామికవేత్తలకు బానిసలుగా మారుస్తున్నారని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. ఈ నెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను గురువారం మన్సూరాబాద్ డివిజన్ ఆటోనగర్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,, కేంద్ర ప్రభుత్వం తక్షణమే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేసి గతంలో ఉన్న 29 లేబర్ చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల సాధన కోసం ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



లేమూరులో వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న బాలరాజ్, ఆశ వర్కర్లు



మన్సూరాబాద్ : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



ఐక్యత చాటుతున్న అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు

# సంక్షోభంలో వ్యవసాయరంగం

- ఆర్థిక నిపుణులు పాపారావు
- ఇందిరాపార్కు వద్ద అఖిల భారత ఐక్య రైతు సంఘంతో కలిసి ధర్నా

కవాడిగూడ, మే 8: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తప్పుడు విధానాలతో వ్యవసాయ రంగం సంక్షోభం ఎదుర్కొంటోందని వ్యవసాయ ఆర్థిక నిపుణులు డీ పాపారావు అన్నారు. మోదీ రైతులకిచ్చిన హామీలె, సీఎం రేవంత్‌రెడ్డి రైతులకిచ్చిన గ్యారెంటీల అమలు, రైతు పండించిన పంటలకన్నింటికీ స్వామినాథన్ కమిషన్ ప్రతిపాదనలకు అనుగుణంగా సమగ్ర పంటలు ఖర్చు ప్రాతిపదికన కనీస మద్దతు ధరలు నిర్ణయించాలని, కనీస మద్దతు ధరల కేంద్ర చట్టం సాధనకై అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో వ్యవసాయ ఆర్థిక నిపుణులు పాపారావు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఏఐయుకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ.. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు తమ వైఖరిని మార్చుకొని రైతు అనుకూల విధానాలు అమలు చేయకపోతే దేశానికి ఆహార భద్రత ఉండదన్నారు. రైతాంగ రుణాలన్నీ రద్దుచేసి జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని ఉపసంహరించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అటవీ హక్కుల చట్టం-2006ను చిత్తశుద్ధితో అమలు చేయడం లేదని, సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఉప్పల ప్రభాకర్ మాట్లాడుతూ.. స్వామినాథన్ సిఫార్సుల మేరకు సమగ్ర ఖర్చుల మీద 50 శాతం లాభం కలిపి ధరలు నిర్ణయించాలన్నారు. అప్పుడే రైతుల ఆదాయం పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐయూకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రంగారెడ్డి, ఉపాధ్యక్షుడు రాము, సహాయ కార్యదర్శి నందిరామయ్య పాల్గొన్నారు.

# శిథిలావస్థ భవనాలపై నివేదిక ఇవ్వండి

- వర్షాకాలంలోపు రక్షణ చర్యలు తీసుకోవాలి
- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్

సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ) : రానున్న వర్షాకాలం నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శిథిలావస్థలోని భవనాలు, కట్టడాలపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యేక సర్వేలు నిర్వహించి శిథిల భవనాలు, కట్టడాలు, పాత ప్రహరీలు మొదలైన వాటిని గుర్తించాలని అన్నారు. అలా గుర్తించిన భవనాలపై ఇంజనీరింగ్ విభాగం నివేదిక ఆధారంగా నిర్మాణ భద్రతను అంచనా వేయాలని సూచించారు. ప్రతి సర్కిల్ స్థాయిలో నివేదిక ప్రకారం తుది జాబితాను సిద్ధం చేయాలని కమిషనర్ చెప్పారు. శిథిలావస్థలోని ప్రభుత్వ పాఠశాల భవనాలు గుర్తిస్తే తక్షణమే విద్యాశాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. అలాగే గుర్తించిన శిథిలావస్థ భవనాలకు నోటీసులు జారీ చేయాలని, అత్యంత ప్రమాదకరంగా ఉన్న భవనాలను తక్షణమే ఖాళీ చేయించడం లేదా సీల్ వేయాలని, భవనాల చుట్టూ బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. భవన యజమానులు మరమ్మతులు చేపడితే, అవి జీహెచ్ఎంసీ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయో లేదో నిర్ధారించాలని, శిథిల భవనాల కూల్చివేతకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. ప్రతి భవనం వివరాలను గూగుల్ స్ప్రెడ్ షీట్‌లో అప్‌డేట్ చేయాలని, నివేదికను జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు. అన్ని సర్కిళ్ల డిప్యూటీ సిటీ ప్లానర్లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు తక్షణమే చర్యలు తీసుకుని నివేదిక సమర్పించాలని, జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజనీర్ (మెయింటెనెన్స్) ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నిర్మాణ స్థిరత్వం, పటిష్టతపై నివేదిక అందజేయాలని, జోనల్ కమిషనర్లు తమ సర్కిళ్లలో ఈ ప్రక్రియను సమీక్షించి నిర్దేశిత గడువులో చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. శిథిలావస్థ భవనాలు స్ట్రక్చర్లపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం, జాప్యం చేసినట్లయితే సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని కమిషనర్ హెచ్చరించారు.